క్లుప్తంగా

'బీవీ రాజు' విద్యార్థుల ప్రతిభ



బెస్ట్‌ఫిజిక్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ నిర్వహించిన ఇంటర్‌యూనివర్సిటీ బెస్ట్‌ఫిజిక్ పోటీల్లో భీమవరం బీవీ రాజు కళాశాల బికామ్ విద్యార్థులు బంగారు, సిల్వర్ మెడల్స్ సాధించారని కళాశాల ప్రిన్సిపల్ ఐఆర్ కృష్ణంరాజు చెప్పారు. మెడల్స్ సాధించిన క్రీడాకారులను మంగళవారం అభినందించారు. బెస్ట్ ఫిజిక్ 70 కిలోల కేటగిరిలో ఎస్‌కే మాన్సూర్ గోల్డ్‌మెడల్ సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కాగా ఎం జగదీష్‌మణికంఠ 75 కిలోల కేటగిరిలో సిల్వర్ మెడల్ సాధించాడని వివరించారు. అనంతరం మెడల్స్ సాధించిన క్రీడాకారులను ప్రిన్సిపల్ కృష్ణంరాజు, వైస్ ప్రిన్సిపల్ సీహెచ్‌ఎల్‌వీ సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ జీపీకే రాజు అభినందించారు.

అంతర్జాతీయ ధ్యాన దినోత్సవంలో శ్రీకాకతీయ విద్యార్థులు



అంతర్జాతీయ ధ్యాన దినోత్సవంలో పాల్గొన్న శ్రీకాకతీయ స్కూల్ విద్యార్థులు

భీమవరం: అంతర్జాతీయ ధ్యాన దినోత్సవంలో భీమవరం శ్రీకాకతీయ మెరిట్ స్కూల్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని స్కూల్ కరస్పాండెంట్ అక్కినేని కృష్ణ కిషోర్ చెప్పారు. గుంటూరులోని హైలాండ్‌లోని సమృత హాల్‌లో నిర్వహించిన పరివర్తన కార్యక్రమంలో గురుదేవ్ రవిశంకర్ స్ఫూర్తితో ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్స్ సుశీల, వాణి మార్గనిర్దేశం చేశారన్నారు. సంపూర్ణత, అంతర్గత శాంతిని ప్రోత్సహించే కార్యక్రమం ప్రశంసనీయమని కృష్ణకిషోర్ కొనియాడారు.

బాధ్యతల స్వీకరణ



చింతగుంట రామచంద్రరావు

వీరవాసరం: వీరవాసరం ఎస్‌వీఎస్ అండ్ వీఈసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా చింతగుంట రామచంద్రరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నారాయణపురంలోని మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ అధ్యాపకునిగా పనిచేశారు. పదోన్నతిపై ప్రిన్సిపాల్‌గా బదిలీపై వచ్చారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి, ఉత్తీర్ణత పెంచడానికి కృషిచేస్తామని తెలిపారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

వీరవాసరం: మండలంలోని ప్రతిరోడ్డు సీసీ రోడ్డుగా మారుస్తామని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. మండలంలోని మడుగుపోలవరం, నందమూరి గరువు, మత్స్యపూరి గ్రామాల్లో పలు సీసీ రోడ్లకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు గ్రామంలో ప్రతి రోడ్డును సిమెంట్ రోడ్డుగా రూపురేఖలు మారుస్తామన్నారు. అదేవిధంగా నేలపోగుల వరకు లింక్ రోడ్ ఏర్పాటు చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని, మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లను కూల్చడం అన్యాయం

పాలకోడేరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చే మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి ఆ శాఖకు ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజును మంత్రిగా నియమించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ కోరారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఉండి ఎమ్మెల్యే పేదల ఇళ్లను కూల్చేస్తున్నారని వాపోయారు. మండలంలోని పాలకోడేరు శివారు అల్లూరి సీతారామరాజు నగర్లో 1989 నుంచి ఇల్లు నిర్మించుకొని నివసిస్తున్న పేదల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. పోరాట కమిటీ నాయకుడు పిచ్చెట్టి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఏఎస్ఆర్ నగర్ లో 1989 నుంచి ఇల్లు నిర్మించుకొని విష సర్పాల మధ్యలో ప్రాణాలు పణంగా పెట్టి అనేక పోరాటాల ద్వారా మంచినీటి, విద్యుత్ సౌకర్యం, సిమెంట్ రోడ్లు కల్పించుకున్న పేదల ఇల్లను కొద్దిమంది స్వార్థం కోసం తొలగించడం సరికాదన్నారు. అన్ని సౌకర్యాలు ఉన్న ఈ ఇళ్లను తొలగించడానికి అధికారులు ఎవరొచ్చినా తాము పోరాటానికి సిద్ధమన్నారు. రఘురామకృష్ణం రాజు కొద్దిమంది ఓట్లు వేస్తే గెలవలేదని పేదలంతా ఆయన గెలుపులో పాలు పంచుకున్నారని ఈ విషయాన్ని ఆయన గమనించాలని కోరారు. అనంతరం ఇళ్ల స్థలాల సాధన పోరాట కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ కన్వీనర్ గా పిచ్చేటి సత్యనారాయణ, సభ్యులుగా నాగవరపు ఈశ్వరి, పాల లక్ష్మి, మల్లుల నాగలక్ష్మి, తమ్మినేని వెంకటలక్ష్మి, సంపత్ రావు, తదితరులు ఎంపిక చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శేషపు ఆశ్రీయ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల బాదుడు

- ఇంధన చార్జీల పేరుతో చార్జీల పెంపు
- యూనిట్‌కు రూ. 97 పైసలు పెంపు



ఆకివీడు విద్యుత్ సబ్ స్టేషన్

ఆకివీడు: ఏరు దాటాక తెప్ప తగలేసిన తీరులో కూటమి ప్రభుత్వ పాలన ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల్ని పెడచెవిన పెట్టి ప్రజలపై బాదుడే బాదుడు అన్నట్లుగా విద్యుత్ చార్జీల పెంపు ఉందని వాపోతున్నారు. ఇంధన చార్జీల పేరుతో యూనిట్‌కు రూ. 0.97 పైసలు భారం పడవేసింది. ఇప్పటికే ఫిక్సిడ్ చార్జీలు, కస్టమ్మర్ చార్జీలు, ఈడీ, సర్‌చార్జి, ఎఫ్‌పీపీసీఏ, ఎఫ్‌పీపీసీఏ-2 ఆ చార్జీల భారాన్ని మోస్తున్న వినియోగదారులపై కొత్తగా ఎనర్జీ చార్జి(ఇంధనం)తో అదనపు సొమ్ము వసూలు చేస్తుంది. సామాన్యుడి దగ్గర నుంచి పారిశ్రామిక వేత్త వరకూ అదనపు చార్జీల భారాన్ని మోయాల్సి వస్తుంది. గృహవసరాల వినియోగదారుడు మరింత ఇబ్బందులకు గురవుతున్నాడు. ప్రస్తుత బిల్లు ప్రకారం యూనిట్‌కు రూ.10 వరకూ చెల్లించాల్సి వస్తుదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. 50 యూనిట్లు వినియోగించిన గృహావసరాల వ్యక్తి రూ. 500పైబడి బిల్లు చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నాడు. ఇప్పుడు ఇంధన చార్జీల పేరుతో బిల్లు వసూళ్లు చేస్తున్నారని, రానున్న రోజుల్లో మరో పేరుతో అదనపు చార్జీలు వసూలు చేస్తారనే ఆందోళన వినియోగదారుల్లో ఉంది. వాతావరణ పరిస్థితులతో రేకు షెడ్డు నుంచి పక్కా భవనాల వరకూ ఏసీల వినియోగంతో మరింత భారం పెరగనుంది.

ఆక్వా పైనా బాదుడే

ఆక్వాను ఆదుకుంటామని, విద్యుత్ భారం తగ్గిస్తామని ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నీటిమూటగా మారిందని ఆక్వా రైతులు వాపోతున్నారు. ఆక్వా రంగంలో విద్యుత్ వినియోగంపై యూనిట్‌కు రూ. 3.50లు వసూలు చేస్తుండగా, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ. 1.50 పైసలకే ఆక్వాకు విద్యుత్ అందజేస్తామని చెప్పి, ఆరునెలలు కావస్తున్నా ఇచ్చిన హామీని అమలు చేయలేదంటున్నారు. పైగా యూనిట్‌కు ప్రస్తుతం రూ. 97 పైసల భారాని మోపారని పలువురు ఆక్వారైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒడిదుడుకులతో ఉన్న ఆక్వాకు సబ్సీడీపై ట్రాన్స్‌ఫార్మర్లు అందజేస్తామని, విద్యుత్ సబ్సీడీ అందజేస్తామని ఇచ్చిన వాగ్ధానాని మరిచి పోయారని వాపోతున్నారు.

సామాన్యుడికి పెను భారం



పెరిగిన విద్యుత్ బిల్లులు సామాన్యుడికి, మధ్య తరగతి ప్రజలకు పెను భారంగా ఉంది. అద్దె ఇళ్లల్లో ఉన్న వారి పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. అద్దెకు సరిపడా విద్యుత్ బిల్లు కూడా రావడంతో లబోదిబోమంటున్నారు. పెంచిన చార్జీలను తొలగించి, భవిష్యత్‌లో విద్యుత్ భారం లేకుండా చూడాలి.

– కె.తవిటినాయుడు, సీపీఎం పట్టణ కార్యదర్శి, ఆకివీడు

సబ్సిడీల జాడేలేదు



ఆటుపోటులతో ఉన్న ఆక్వా రంగాన్ని ఆదుకుంటామని చెప్పిన ప్రభుత్వం సబ్సిడీలు ఇవ్వకుండానే అదనపు చార్జీలు వసూలు చేస్తూ భారం మోపింది. రైతులకు పెరిగిన ఛార్జీల భారం భారంగానే ఉంది.

– భూపతిరాజు బుజ్జిరాజు, చేపల రైతు, సిద్ధాపురం

రూ.500లు పైనే పెరిగింది



విద్యుత్ బిల్లులు బారీగా పెరిగాయి. ప్రతీ నెలా రూ. 600, రూ.700 లు వస్తున్న బిల్లు రూ.1500లు వరకూ వచ్చింది. ఇంధనపు చార్జీల పేరుతో సామాన్య ప్రజలపై పెనుభారంగా ఉంది. చెమటోడ్చి కష్టపడి పనిచేస్తున్న మాలాంటి కార్మికులు, రైతులు ఇది మోయలేని భారంగా మారింది.

– ఎల్. రామకృష్ణ, కార్మికుడు, సంతపేట

వైభవంగా నందమూరి గరువు తిరునాళ్లు





వీరవాసరం: మండలంలో నందమూరి గరువలో శ్రీరామ భక్తాంజనేయ స్వామి 59వ వార్షిక మహోత్సవాల తిరునాళ్లు కోలాహలంగా నిర్వహించారు. పిల్లలు, యువతీ యువకులు ఈ తిరునాళ్లలో సందడి సందడి చేశారు. మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంధ సింధూరం, తమలపాకులతో స్వామివారిని అలంకరించారు. నందమూరి గరువు ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన విద్యుత్ దీపాలంకరణలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. భారీ సెట్టింగులు కనువిందు జేస్తున్నాయన్నారు.

సీపీఐ శత వార్షికోత్సవాలను విజయవంతం చేయాలి



భీమవరంలో సీపీఐ మున్సిపల్ కార్మికుల శాఖా సమావేశంలో నినాదాలు చేస్తున్న దృశ్యం

భీమవరం: సీపీఐ శత వార్షికోత్సవాల్లో భాగంగా ఈనెల 26వ తేదిన భీమవరంలో నిర్వహించే ప్రదర్శన, బహిరంగ సభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపల్ కార్మికుల సీపీఐ శాఖా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రమజీవుల హక్కుల సాధనే లక్ష్యంగా కార్మికుల శ్రమదోపిడీకి వ్యతిరేకంగా కనీస వేతనాలు, 8 గంటల పని వంటి అనేక కార్మిక హక్కులు, చట్టాలు సాధనకు సీపీఐ నిర్విరామ పోరాటాలు సాగించిందన్నారు. సీపీఐ ఆవిర్భాం జరిగి వందేళ్లు అవుతున్న సందర్భంగా జరుగుతున్న శత వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించాలని, వాడవాడలా సీపీఐ పతాకాలు ఆవిష్కరించి ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించి పార్టీ ఉద్యమ పోరాటాలు, చరిత్రను వివరించాలని భీమారావు కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సముపార్జనలో ఎంతోమంది కమ్యూనిస్టులు జైళ్లకు వెళ్లారని, దేశంలో ప్రజాస్వామ్యం, లౌకిక రాజ్యాంగ పరిరక్షణకు, మతసామరస్య సాధనకు ఎనలేని కృషి నిర్వహిస్తుందన్నారు. ఈ సమావేశంలో కిల్లరి మల్లేశ్వరరావు, యేలేటి విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు దాతల సహకారం మెండు



భీమవరంలో బీడీఎస్ విద్యార్థి కుటుంబ సభ్యులకు సహాయం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: పేద విద్యార్థుల చదువులకు దాతల సహాయం ఎల్లప్పుడు ఉంటుందని భీమవరం పట్టణంలోని తుమ్మలపల్లి మంగరాజు ట్రస్ట్ చైర్మన్, రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా నాయకుడు తుమ్మలపల్లి శివ అన్నారు. భీమవరం విష్ణు కళాశాలలో బీడీఎస్ చదువుతున్న అబ్బరాజు పవన్ కళ్యాణ్‌కు శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో దాతలను సమీకరించి రూ. 20 వేలు ఆర్థిక సహాయాన్ని మంగళవారం శివ చేతులు మీదుగా అందజేశారు. విద్యార్థి పవన్‌కల్యాణ్‌కు తన వంతు సహాయంగా ప్రతి ఏటా కొంత మొత్తం నగదు అందిస్తామన్నారు. వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ విద్యార్థికి గతంలో రూ. 65 వేలు దాతల ద్వారా అందించామన్నారు. ప్రస్తుతం కాకినాడ ఐటీవో చాగంటి రామారావు రూ.15 వేలు, తుమ్మలపల్లి మంగరాజు ట్రస్ట్ రూ. 5 వేలు అందిస్తున్నట్లు చెప్పారు.

వినియోగదారుల క్లబ్బులపై అవగాహన



ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో మాట్లాడుతున్న సన్నీరాజ్

భీమవరం: కళాశాలల్లో వినియోగదారుల క్లబ్స్ ఏర్పాటు ద్వారా విద్యార్థులకు అవగాహన కల్గించవచ్చునని అసోసియేషన్ ఫర్ లీగల్ అండ్ సోషల్ అవేర్నెస్ ప్రెసిడెంట్ బొమ్మిడి సన్నీరాజ్ చెప్పారు. మంగళవారం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో వలంటరీ కన్జ్యూమర్ అసిస్టెంట్ నెట్‌వర్క్ పేరుతో వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ ఎం జగపతి రాజు, ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల గురించి టెక్నాలజీ ద్వారా తెలుసుకోవాలని సూచించారు. అనంతరం న్యాయవాదులు కె లక్ష్మి, ఆకుల తేజ కన్జ్యూమర్ హక్కులపై విద్యార్థులు వ్యక్తం చేసిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ హెడ్ బీహెచ్‌వీఎస్ రామకృష్ణంరాజు, డీన్ అకాడమిక్స్ వి చంద్రశేఖర్, ఎం జీవన సుజాత, ఎంవీపీఎస్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



చినకాపవరంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆకివీడు: అంగన్‌వాడీ కేంద్రంలో బాలల హాజరు సంఖ్య పెంచాలని తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని చినకాపవరం గ్రామంలో మంగళవారం గ్రామ రెవెన్యూ సదస్సు జరిగింది. సదస్సులో వచ్చిన పలు ఫిర్యాదుల్ని ఆయన స్వయంగా వెళ్లి పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల సంఖ్య చాలా తక్కువగా ఉందని చెప్పారు. బాలింతలకు, గర్భిణులకు ప్రభుత్వం అందజేసే పౌష్టికాహారం సక్రమంగా అందజేయాలని ఆదేశించారు. గ్రామంలో ఖాళీ స్థలంలో వ్యర్థాలు, మురుగునీరు నింపుతున్నారని గ్రామస్తులు చేసిన ఫిర్యాదును తహసీల్దార్ స్వయంగా పరిశీలించారు. మురుగు కూపంగా ఉన్న ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా పంచాయతీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామంలో హెల్త్ సెంటర్‌కు ఎంఎల్‌హెచ్‌పీ(సీహెచ్‌ఓ) సక్రమంగా రావడంలేదని ఫిర్యాదు చేశారు. రెవెన్యూ సదస్సులో 18 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఆర్ఐ ఆంజనేయులు, వీఆర్‌ఓ టీ.సత్యనారాయణ, వెల్ఫేర్ అసిస్టెంట్ కట్రెడ్డి వీరన్న, సర్వేయర్ సందేష్ పాల్గొన్నారు.

ప్రజలపై కరెంటు చార్జీల పిడుగు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్



కరెంట్ చార్జీల బాదుడుపై పోరుబాట పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న పీవీఎల్ నరసింహరాజు

కాళ్ల: కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై కరెంటు చార్జీల భారం మోపడం దారుణమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 27న నిర్వహించే కరెంట్ చార్జీలు బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట్ట పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం కాళ్ల మండలం పెద అమీరం పార్టీ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడితే కరెంటు చార్జీలు పెంచనని ఇచ్చిన హామీలను చంద్రబాబు తుంగలోకి తొక్కారని ఎద్దేవా చేశారు. అవసరమైతే చార్జీలు తగ్గిస్తామంటూ బూటకపు హామీలు ఇచ్చిన చంద్రబాబు ప్రజలను నట్టేట ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు వినియోగదారులే కరెంటు అమ్మేలా చేస్తానని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు మళ్లీ ఇచ్చిన హామీలను మరిచి ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. ఆరు నెలలు తిరగకుండానే ప్రజలపై చార్జీల పిడుగు వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధపు హామీలతో అధికారం లోనికి వచ్చిన చంద్రబాబు హామీలను తుంగలోకి తొక్కారని విమర్శించారు. అబద్ధపు వాగ్దానాలు చేసి ప్రజలతో ఓట్లు వేయించుకుని ఇప్పుడు ప్రజలను బాదుడే బాదుడు అంటూ ప్రజలను బాధపెడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో 27న నిర్వహించే పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పోరుబాట బ్రోచర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాళ్ల ఉండి, మండలాల పార్టీ కన్వీనర్లు గణేశ్న రాంబాబు, పెనుమత్స ఆంజనేయరాజు, జిల్లా ఆక్వా సలహా మండలి మాజీ సభ్యులు పెనుమత్స దుర్గా ప్రసాద్ రాజు, మంతెన సునీల్ రాజు, అంబటి రమేష్, పెనుమత్స రంగరాజు, వేగేశ్న నాగరాజు, డొక్కు సుబ్రమణ్యం, సాంసన్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాలు ఎండగట్టాలి

వాల్ పోస్టర్ ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ నాయకులు



విద్యుత్ పోరుబాట బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం:అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చి గద్దెనెక్కిన కూటమి సర్కార్ ప్రజల నెత్తిన మోయలేని కరెంట్ చార్జీలు వేస్తుందని వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్రంగా విమర్శించారు. మంగళవారం భీమవరంలో ఏర్పాటుచే సిన విలేకర్ల సమావేశంలో కరెంట్ చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట పేరుతో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి మాట్లాడుతూ ఈనెల 27న రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో వైఎస్సార్ సీపీ చేపట్టిన పోరుబాట నిరసన కార్యక్రమాన్ని జిల్లాలో పూర్తి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 27న విద్యుత్ శాఖ కార్యాలయాల వద్ద ప్రజలతో కలసి ఆందోళనలు చేయాలని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ వినతిపత్రాలు ఇవ్వాలని చెప్పారు. కూటమి ప్రభుత్వం 6 నెలల కాలంలోనే రెండు దఫాలుగా ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.15,485.36 కోట్ల భారాన్ని మోపిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ చార్జీల పెంపును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ మైనార్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిది జాన్సన్, వైఎస్సార్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు చినమిల్లి వెంకట్రాయుడు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బందులకు గురిచేసిన ప్రభుత్వం విద్యుత్‌చార్జీల పెంపుతో ప్రజలపై పెను భారం వేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకపోగా విద్యుత్‌చార్జీల పెంపుతో వినియోగదారుల నడ్డివిరుస్తోందని విమర్శించారు. గౌడకార్పోరేషన్ మాజీ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ గాదిరాజు రామారాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టుతూ ప్రజల పక్షాన పోరాడాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. భీమవరం పట్టణం, మండలం, వీరవాసరం మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో శుక్రవారం ఉదయం 10 గంటలకు యూనియన్ బ్యాంక్ వద్దకు చేరుకోవాలన్నారు.

రేపు పాలకోడేరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పాలకోడేరు : పాలకోడేరు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని గురువారం మధ్యాహ్నం 2:30 నుంచి నిర్వహించనున్నట్లు పాలకోడేరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు భూపతిరాజు చంటి రాజు తెలిపారు. మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

ఏసు బోధనలు అనుసరణీయం

భీమవరం అర్బన్: పాపులను రక్షించడానికి ఏసు ప్రభువు భూమిపై అవతరించి ఎన్నో కష్టాలు పడ్డారని దైవజనులు బి. ముఖర్జీ అన్నారు. భీమవరం మండలంలోని కొవ్వాడ అన్నవరంలో బీవీ రాజు కాలనీలో మంగళవారం పరిశుద్ధ క్రీస్తు దేవాలయంలో పాస్టర్ ఆర్‌జే ప్రసాద్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్టమస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా దైవజనులు బి.ముఖర్జీ మాట్లాడుతూ ఏసు క్రీస్తు బోధనలు సమాజానికి అనుసరణీయమని అన్నారు. అనంతరం క్రైస్తవ గీతాలపనలు చేసి కేక్ కట్ చేసి అందరికి పంచారు.

అట్టహాసంగా క్రిస్మస్ వేడుకలు



వీరవాసరం: రాయకుదురులో ప్రార్థనలు



ఆకివీడు: విద్యుత్ దీపాలతో సెంట్రల్ బాప్టిస్టు చర్చి

వీరవాసరం: మండలంలో క్రిస్మస్ సందర్భంగా పలు చర్చిల్లో మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. లోక రక్షకుడైన ఏసుక్రీస్తు వారి గీతాలు ఆలపిస్తూ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. చర్చలన్నింటికీ విద్యుపాలతో సుందరంగా అలంకరించారు. శాంతాక్లాజ్ వేషాలు వేసి బహుమతులు అందజేశారు. ప్రజలందరి పైన ప్రేమ ,కరుణ, దయ, సేవ భావంతో జీవితాన్ని గడిపేలా ప్రభువైన ఏసుక్రీస్తు ఆశీర్వాదాలు ప్రతి ఒక్కరి పైన ఉండాలని ప్రార్థనలు చేశారు. సంఘ విశ్వాసులు సంఘ కాపరులు, యూత్ సమాజం, స్త్రీల సమాజం సభ్యులు చర్చల ప్రార్థన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో నేతల జ్ఞాన సుందర్రాజు, మానుకొండ ప్రదీప్ కుమార్, గెడ్డం భారతి, చికిలే మంగతాయారు, గెడ్డం భాస్కరరావు, బొంతు రమేష్, వెంపళ్ల బన్ను, చిక్కాల రాజు, గోడి షణ్ముఖరావు, పత్తుల సాల్మన్ రాజు పాల్గొన్నారు.

చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు

ఆకివీడు: క్రిస్మస్ సందర్భంగా పలు చర్చిల్లో మంగళవారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా చర్చిలు, క్రైస్తవుల ఇళ్ల వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక నక్షత్రాలను ఏర్పాటు చేశారు. ఆయా చర్చిల్లో స్త్రీల సమాజం ప్రత్యేక గీతాలు ఆలపించారు. మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చెరుకువాడ గ్రామంలోని పెదపేటలో స్త్రీల సమాజం ఆధ్వర్యంలో స్త్రీల క్రిస్మస్ ఆరాధన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు మన్నా చర్చి నిర్వహకులు సునీత జ్యోతిరాజు ప్రత్యేక అతిథిగా పాల్గొని మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ ప్రాముఖ్యతను తెలియజేశారు. పాస్టర్ రెవ.జార్జి ముల్లర్, సంఘ అధ్యక్షుడు కోరాటి శ్యామ్, సీఆర్ ఎం.ఫిలిప్, కె.శ్యామ్యూల్, అధ్యాపక సంఘ అధ్యక్షురాలు జి.మార్తమ్మ పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు చర్చిలు ముస్తాబు

భీమవరం (ప్రకాశంచౌక్): క్రిస్మస్ పండగకు పట్టణంలోని చర్చిలు ముస్తాబయ్యాయి. చర్చిలను రంగులతో, విద్యుద్దీపాలతో అలంకరించారు. చర్చిల ఎదుట క్రీస్తు జనన ఘట్టాలను సర్వాంగ సుందరంగా ఏర్పాటు చేశారు.